క్లుప్తంగా

నివాళి



నివాళులర్పిస్తున్న దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి, నాయకులు

ఓడీ చెరువు: మండలంలోని ఉంట్లవారిపల్లికి చెందిన జెడ్పీటీసీ సభ్యుడు కుర్లి దామోదర్‌రెడ్డి తండ్రి కుర్లి ఉత్తమరెడ్డి మొదటి వర్ధంతి వేడుక శనివారం ఆయన స్వగ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తండ్రి, సీనియర్ నాయకులు దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి, డాక్టర్ నాగేంద్రకుమార్ రెడ్డి వేరువేరు సమయాల్లో హాజరయ్యారు. ఘాట్ వద్ద కుర్లి ఉత్తమరెడ్డి కుమారులతో కలసి నివాళులు అర్పించారు. దుద్దుకుంట వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

తనకల్లు: స్థానిక పాతూరు గుట్ట వద్ద నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనానికి శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మౌలాబీ మాట్లాడుతూ బూడిదగడ్డ వీధికి సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం నిర్మించడానికి ప్రభుత్వం రూ. 13 లక్షలను మంజూరు చేసినట్లు తెలిపారు. భవన నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నాగలక్ష్మీ, వార్డు మెంబర్ శివమ్మ, నాయకులు శ్రీనివాసులనాయుడు, బీఎస్ నిజాం, హేమశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణ, చంద్ర, నరసింహులు, లక్ష్మన్న, ఉత్తన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో అభయాంజనేయుడు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లింగాశెట్టిపాళ్యం వీధిలో నున్న అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆంజనేయస్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదమంత్రాల నడుమ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేపట్టిన అనంతరం పూలు, తులసిమాలలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయానికి చేరుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

లక్ష్మీనరసింహస్వామికి..

తాడిమర్రి: మండలంలోని ఏకపాదంపల్లి, నార్శింపల్లి, నిడిగల్లు గ్రామాల్లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ పూజారులు ఆయా ఆలయాల్లోని మూలవిరాట్‌లకు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామికి కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే తాడిమర్రిలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డ్రిప్పు పరికరాల దగ్ధం



కాలిపోయిన పైపులు

తనకల్లు: మండల పరిధిలోని తవళం గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు తన మూడు ఎకరాల పొలంలో ఏర్పాటు చేసిన డ్రిప్పు పరికరాలు, పైపులు శనివారం అగ్నికి ఆహుతయ్యాయి. వివరాలు....శ్రీనివాసులు గ్రామానికి సమీపంలో తన పొలంలో మామిడి తోటను సాగు చేస్తున్నాడు. అయితే కొందరు గుర్తుకు తెలియని వ్యక్తులు దగ్గరల్లోని గుట్టకు నిప్పుపెట్టడంతో గాలికి మంటలు పొలానికి వ్యాపించాయి. దీంతో పొలంలో ఉన్న డ్రిప్పు పరికరాలతో పాటు ల్యాడర్లు, పీవీసీ పైపులు, కొన్ని మామిడి చెట్లు కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు. మొత్తం దాదాపు రూ. లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

రెండు రోజులు 144 సెక్షన్

ఓడీ చెరువు: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండలంలో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలను ఈ నెల 13 రాత్రి వరకు మూసివేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు సోమవారం మండల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పోలింగ్ బూత్‌కు వచ్చి నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక సందడి



భక్తజనంతో సందడిగా మారిన టెంపుల్ స్ట్రీట్



ఆకట్టుకుంటున్న కీలుగుర్రాలు.. మర మనుషులు



శ్రీవారి దర్శనం కోసం భక్తుల ఎదురుచూపు



పిల్లల నృత్యాలు..భలే భలే

ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కదిరిలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. కూచిపూడి, భరత నాట్యాలు, నాటికలు, తోలుబొమ్మలాటలు అలరిస్తున్నాయి. కీలు గుర్రాలు, ఎత్తు మరమనుషులు, వివిధ రకాల వాయిద్యాలు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆలయ ప్రాంగణంలో కాలుమోపేందుకు కూడా లేనంతగా భక్తుల రద్దీ ఉంది. శనివారం లక్ష్మీనరసింహా స్వామి గరుడ వాహనంపై తిరువీధుల్లో దర్శనమిచ్చారు. –కదిరి

పిల్లల్ని ఇంటి వద్ద చదివించాలి



సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

పుట్టపర్తి అర్బన్: పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల సమయం దగ్గరపడుతోందని ఇంటి వద్ద చదివించే బాధ్యత తల్లిదండ్రులదేనని పెడపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదవాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణతకు మీ సహకారం ఎంతో అవసరమని తల్లిదండ్రులకు సూచించారు. సెల్‌ఫోన్లు వాడకుండా, టీవీలు చూడకుండా మరో నెల పాటు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంత వరకూ జరిగిన పరీక్షల్లో వచ్చిన మార్కులను సబ్జెక్టుల వారీగా తెలియజేశారు. ప్రతి ఉపాధ్యాయుడూ ఐదుగురు విద్యార్థులను దత్తత తీసుకొని చదివిస్తున్నారన్నారు. వంద రోజుల కార్యక్రమాల ఫలితాలు బాగున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమశేఖర్, రాజు, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. శనివారం పుట్టపర్తి పట్టణంలో పలు వార్డులలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు చెరువుభాస్కర్ రెడ్డి, సూర్యాగౌడ్, సాయిగీత లక్ష్మీపతిరావ్, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు రమేష్, నరశింహులు తదితరులు పాల్గొన్నారు.

‘వెన్నపూస’ను గెలిపించాలి

ఓడీ చెరువు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మద్దే రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గాజుకుంటపల్లి, ఇనగలూరు గ్రామాల్లో పట్టభద్రులను కలసి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు బాబాఫక్రుద్దీన్, డీలర్ బయపరెడ్డి,ఇద్దే క్రిష్ణారెడ్డి,సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్ సస్పెన్షన్

ధర్మవరం: పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న ఇంగ్లిష్ లెక్చరర్ ప్రభాకర్‌ను సస్పెండ్ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారంరోజుల క్రితం ఇంగ్లిష్ లెక్చరర్ ప్రభాకర్ అదే కళాశాలలో చదువుతున్న ఫైనలియర్ విద్యార్థిని పట్ల ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడిన ఆడియో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల వద్ద ఆందోళన చేశారు. దీంతో డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారిణి నాగమణి ఉత్తర్వుల మేరకు లెక్చరర్ ప్రభాకర్‌ను సస్పెండ్ చేశామని ప్రిన్సిపాల్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కేంద్రాలను పరిశీలిస్తున్న సీఐలు

ధర్మవరం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 13న సోమవారం జరగనున్న నేపథ్యంలో శనివారం పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం, ట్రాఫిక్ సీఐ వహీద్ బాషా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తుకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపడతామన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటును ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని తెలిపారు. పోలింగ్ రోజు గొడవలు సృష్టిస్తే ఎంతటి వారిపైన అయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని కట్టకిందపల్లి సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. కదిరికి చెందిన మోహన్‌బాబు, త్రిలోక్‌నాథ్ ఇరువురూ స్నేహితులు. వీరు వ్యక్తిగత పనులపై అనంతపురం వెళ్లి తిరిగి కదిరికి ద్విచక్రవాహనంలో వెళుతున్నారు. కట్టకిందపల్లి వద్దకు రాగానే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఎదురుగా వస్తున్న వాహనాల ఫోక్సింగ్‌కు కనిపించక అదుపు తప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో వారు ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ఎన్‌పీ కుంటకు చెందిన 108 వాహనం అక్కడికి చేరుకుని పైలట్ ప్రసాద్ రెడ్డి, ఈఎంటీ సాంబశివ క్షతగాత్రులకు ప్రథమ చికిత్సలు నిర్వహించి అనంతరం ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలో గట్ల వద్ద ఉన్న అన్నమాచార్య పాఠశాల నాలుగో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి హాజరై పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్‌ప్రకాష్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులునాయక్, సచివాలయాల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, విశ్వనాథ్, సర్పంచ్ రాఘవ, చలపతినాయక్, ఎస్టీ సెల్ నాయకులు క్రిష్ణానాయక్, నారాయణ నాయక్ తదితరులున్నారు.

14న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ భానురేఖ

కనగానపల్లి: ఈ నెల 14న అన్ని పాఠశాలలు, కళాశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామని పీహెచ్‌సీ డాక్టర్ భానురేఖ తెలిపారు. శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రల పంపిణీపై అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం 1 నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. ఇందుకోసం మండలంలోని 53 అంగన్‌వాడీ కేంద్రాలు, 47 ప్రభుత్వ, 5 ప్రైవేట్ పాఠశాలలోని మొత్తం వంద కేంద్రాలు ఏర్పాటుచేసి విద్యార్థులకు మాత్రలు వేయిస్తున్నామన్నారు. ఆ రోజు పాఠశాలలకు రానివారికి తిరిగి ఈనెల 18న మాత్రలు వేయించాలన్నారు. ఈ సమావేశంలో సీహెచ్‌ఓ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బాటిల్ నీరు.. లాగించేశా..



కదిరి అర్బన్: పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణంలో శనివారం ఓ వానరం వాటర్‌బాటిల్‌తో దాహార్తి తీర్చుకుంది. ఎండవేడిమికి సేదతీరడానికి చెట్టుకింద వచ్చి తన వద్ద ఉన్న వాటర్‌బాటిల్‌తో ఓ ఉపాధ్యాయుడు నీరు తాగుతుండగా ఓ వానరం వచ్చి చేయిచాచి వాటర్‌బాటిల్ తనకూ ఇవ్వమంది. అంతే ఆ ఉపాధ్యాయుడు తన చేతిలో ఉన్న వాటర్‌బాటిల్‌ను జాలితో వానరానికి ఇచ్చేశాడు. పక్కనే ఉన్న రాయిపై కూర్చుని వాటర్‌బాటిల్‌లోని నీరంతా తాగేసి బాటిల్ అక్కడే పడేసి వెళ్లిపోయింది వానరం.

కాన్పుల వార్డు పరిశీలన

కదిరి టౌన్: కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలోని కాన్పుల వార్డు, ఆపరేషన్ థియేటర్‌ను సెంట్రల్ లక్ష్య అసెస్‌మెంట్ టీం శనివారం పరిశీలించింది. సేవలను మెరుగుపరచటానికి సలహాలు, సూచనలు వైద్య సిబ్బంది తెలియజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, టీం సభ్యులు అగర్తలా నుంచి డాక్టర్ ముజుముందర్, బెంగళూరు నుంచి డాక్టర్ వాసంతిరెడ్డి, వైద్యులు నిస్సార్ అహమ్మద్, ప్రత్యూష, శిరీష, నర్సింగ్ సూపరింటెండెంట్ వల్సాల దేవి, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

కదిరి అర్బన్: పట్టణంలోని అడపాలవీధిలో ఉన్న షిర్డీ సాయి స్కూల్‌లో శనివారం శ్రీ కృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కదిరి డివిజన్ అధ్యక్షునిగా చింకుంట రమేష్‌బాబు, గౌరవాధ్యక్షులుగా నరసింహులు,గౌరవ ఉపాధ్యక్షులుగా గవ్వల శ్రీనివాసులు,మంజుల, గౌరవ సలహామండలి సభ్యులుగా బ్లూమూన్ శివశంకర్, పసుపులేటి సురేష్, ఉపాధ్యక్షులుగా బైరిశెట్టి, కాకర్ల వాణి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా పోగునూరి ఆదితో పాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు.

మహాద్భుతం.. రామకోటి వస్త్రం



రాప్తాడు/అనంతపురం కల్చరల్: వినూత్న అంశాలతో పట్టు వస్త్రాలను నేసి ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న ధర్మవరం చేనేత కళాకారులు పల్లా సురేంద్రనాథ్, పల్లా తేజ, జూజారు నాగరాజు.. మరో అద్భుతాన్ని ఆవిష్కరించారు. 18 గజాల పొడవుతో నేసిన పట్టు వస్త్రం బార్డర్‌లో రామాయణంలోని అపురూప సన్నివేశాలను, వస్త్రం మధ్యలో జైశ్రీరామ్ అంటూ మొత్తం 32,200 పదాలను అద్భుతంగా నేశారు. నేత్రపర్వమైన ఈ రామకోటి వస్త్రాన్ని మౌనగిరి క్షేత్రంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం అందజేశారు.

ముగిసిన సెంట్రల్ స్థాయి క్విజ్ పోటీలు



ప్రథమ స్థానంలో నిలిచిన విభిన్న ప్రతిభావంతులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సెంట్రల్ స్థాయి క్విజ్ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో విభిన్న ప్రతిభావంతుల సెక్టార్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయ ఆడిటోరియంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ద్వితీయ స్థానంలో తాడిపత్రి ఏరియా విద్యార్థులు, తృతీయ స్థానంలో నల్లచెరువు ఏరియా విద్యార్థులు నిలిచారు. క్విజ్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి సాయిరాం, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్‌మురళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆర్డీటీ విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి, ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీతత్వ ప్రపంచంలో గ్రామీణ విద్యార్థులను తెలుగు, గణితం, సైన్స్, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్‌లో ప్రతిభ కనబరచడం హర్షించదగ్గ విషయమన్నారు. పోటీల్లో అనంతపురం, శ్రీసత్యసాయి పుట్టపర్తి, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, ఒంగోలు జిల్లాల్లోని పిల్లలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ.. నమస్తుభ్యం


నల్లమాడ: స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఎస్‌ఓ శోభారాణి ఆధ్వర్యంలో శనివారం సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. సర స్వతీ దేవి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి వేద బ్రాహ్మణులు వివిధ పూజలు నిర్వహించారు. ఎస్‌ఓ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరుతూ సరస్వతీ దేవికి పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

సుందరంగా ఆలయ నిర్మాణం

- రూ. కోటిన్నరతో గంగిరెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి సొబగులు
- త్వరలోనే పునఃప్రతిష్టాపన కార్యక్రమాలు



గంగిరెడ్డి పల్లి ఆంజనేయస్వామి ఆలయం



ఆలయం ముందు భాగంలో చెరువు

పుట్టపర్తి అర్బన్: మహిమాన్వితుడైన గంగిరెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలో పునఃప్రతిష్టాపన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కలిగిన ఆంజనేయస్వామి ఆలయానికి సుమారు రూ.కోటిన్నరతో సుందరంగా పునర్నిర్మించారు.

నిధులిస్తామని మొహం చాటేసిన నిమ్మల కిష్టప్ప

పుట్టపర్తి మండలం గంగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని చెరువు పక్కన వెలసిన ఆంజనేయస్వామి భక్తుల కొంగు బంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పెద్ద ఎత్తున భక్తులు నమ్మకాన్ని నిలబెడుతుండడంతో లక్షలాదిగా భక్తులున్నారు. ఆరేళ్ల క్రితం చిన్నగా ఉన్న ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. విగ్రహాన్ని అలాగే ఉంచి ఆలయాన్ని కూల్చివేసి నూతన ఆలయం నిర్మాణానికి గ్రామస్థులు, భక్తులు సంకల్పించారు. ఆలయాన్ని తొలగించిన తరువాత అప్పటి ఎంపీ నిమ్మల కిష్టప్ప ఎంపీలాడ్స్ నిధులు ఇస్తానని చెప్పి అరకొరగా ఇవ్వడంతో పనులు పూర్తిగా నిలిచి పోయాయి. సుమారు రెండేళ్ల ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆలయంలో నిల్వ చేసిన సుమారు 500 బస్తాల సిమెంటు గట్టిపడి నిర్మాణానికి పనికి రాకుండా పోవడంతో వాటిని చెరువులోకి పడేశారు. అయితే, ఇటీవల గ్రామానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి సమస్య వివరించగా.. వెంటనే ఎమ్మెల్యే నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పనులు ఊపందుకున్నాయి. ఇక ఆలయం నుంచి వచ్చిన ఆదాయంతో పనులు పూర్తి చేయడానికి పూనుకున్నారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..

ఆంజనేయస్వామి ఆలయంపై భాగాన పెద్ద కొండ ఉంది. ముందు భాగంలో చెరువు ఉంది. చెరువు కింద చింతతోపు ఉండడం, చుట్టూ అటవీ ప్రాంతం విస్తారంగా ఉండడంతో భక్తులు వచ్చి రోజంతా ఉండడానికి ఏర్పాట్లు చేసి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గంగిరెడ్డిపల్లి గ్రామస్థులు కోరుతున్నారు. పుట్టపర్తి మండలం పెడపల్లి నుంచి కదిరి వరకూ పంచాయతీరాజ్ రోడ్డు ఉంది. దీన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఆలయాన్ని చేరుకోవడానికి ఉన్న చెరువు కట్టను మరింత అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. పెడపల్లి నుంచి కొండకమర్ల వరకూ ఆర్టీసీ బస్సులు తిప్పితే భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి కావస్తుండడంతో భక్తుల సంఖ్య బాగా పెరిగిందని ఆలయ పురోహితులు తోయరాజు స్వామి పేర్కొన్నారు. పురోహితులు ఉండడానికి రెండు గదులను నిర్మించాలని, భక్తులు చేయూతనందించాలన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వేడుకలకు హాజరై విజయవంతం చేయాలన్నారు.